క్లుప్తంగా

వేగంగా శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు



నింద్రలో నిర్మాణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వర ఆలయ పనులు వేగంగా సాగుతున్నాయి. మాజీ మంత్రి రోజా చొరవతో రూ.1.75 కోట్లతో నిర్మాణ పనులు చేస్తున్నారు. గతంలో శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయానికి మంత్రి రోజా టీటీడీ చైర్మన్‌తో మాట్లాడి నిర్మాణానికి నిధులు కేటాయించారు. దీంతో గ్రామంలో ఆలయ నిర్మాణం సాగుతోంది.

వేడుకగా పీర్ల పండుగ



ఊరేగింపులో ముస్లింలు

పాలసముద్రం: కన్నికాపురం మసీదులో ముస్లింలు గురువారం వేడుకగా పీర్ల పండుగ నిర్వహించారు. ఉదయం మసీదులో వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నెల రోజులుగా ఉపవాసం ఉన్న భక్తులు ఊబా, మలీస్‌ను తమ దేవుడి పాటలు పాడుతూ ఊరేగించారు. ఉపవాసం ఉన్న భక్తులు తమ చర్మంపై బ్లేడ్‌లతో కొట్టుకుని భక్తిని చాటారు. మసీదు నుండి గుండుబావి క్రాస్ రోడ్డు వరకు ఊరేగించారు. మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి పీర్ల పండుగను తిలకించారు.

క్రమశిక్షణతో ఎదుగుదల



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద

వెదురుకుప్పం: క్రమశిక్షణే విద్యార్థుల ఎదుగుదలకు సోపానమని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. గురువారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా వచ్చి చేరిన విద్యార్థులు సీనియర్లను అనుసరించి నియమనిబంధనలతో నడుచుకోవాలని సూచించారు. చెడు ఆలోచనలు భవిష్యత్తును పక్కదోవ పట్టిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యాపీఠంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో గురువారం సార్వత్రిక విద్యాపీఠంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీధర్‌రాజు మట్లాడుతూ 2024–25 సంవత్సరానికి ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ కోర్సులకు అడ్మిషన్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ స్కూల్‌లో చేరాలని అన్నారు. ప్రయివేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వం విద్యా విధానం అందిస్తోందని అన్నారు.

నెల్లేపల్లి పాఠశాలకు క్రీడా సామగ్రి



క్రీడా పరికరాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

గంగాధరనెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి పాఠశాలకు జేటీడీ ఫర్ గర్ల్స్ అనే సంస్థ ద్వారా 70 వేల రూపాయలు విలువైన క్రీడా సామగ్రిని అందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుబ్బరత్నమ్మ తెలిపారు. జేటీడీ ఫర్ గర్ల్స్ సంస్థ ప్రభుత్వ పాఠశాలలో క్రీడలను అభివృద్ధి చేయడానికి తోడ్పడం అభినందనీయమన్నారు. వాలీబాల్ స్పైక్ మిషన్, ఇతర క్రీడా పరికరాలను పాఠశాల విద్యార్థుల కోసం అందించారని తెలిపారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం యుగంధర్ ఆచారి, వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మయ్య, విద్యార్థులు క్రీడాసామగ్రి అందజేసిన జేటీడీ ఫర్ గర్ల్స్ సంస్థకు చెందిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

నాటకమే.. జీవితం

అంతరించి పోతున్న వీధి నాటకాలకు ఇల్లత్తూరు గ్రామానికి చెందిన కళాకారులు జీవం పోస్తున్నారు. ఊరూరా తిరుగుతూ వీధి నాటకాలను ప్రదర్శిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా నాటకాలు ఉంటుండడంతో చాలా మంది వాటిని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు కళాకారులకు విరాళాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. నేటి సమాజంలో టీవీ, సినిమాలు, సీరియళ్లపై మోజు పెరిగినా వీధి నాటకాలకు ఉండే క్రేజ్ మాత్రం తగ్గడం లేదు.

– విజయపురం

- వీధి నాటకాలకు జీవం పోస్తున్న కళాకారులు
- పెరుగుతున్న ఆదరణ
- ఇల్లత్తూరు కళాకారులకు ఇరు రాష్ట్రాల్లో మంచి పేరు
- ఆంధ్ర, తమిళనాడులో అలరిస్తున్న ఇల్లత్తూరు కళాకారులు



తమిళనాడులో నాటకాలు వేస్తున్న ఇల్లత్తూరు కళాకారులు

విజయపురం: అంతరించి పోతున్న వీధి నాటకాలకు చిత్తూరు జిల్లా, విజయపురం మండలం, ఇల్లత్తూరు గ్రామానికి చెందిన కళాకారులు జీవం పోస్తున్నారు. ఏడాదికి 300 రోజులు ఊరూరా తిరుగుతూ వీధి నాటకాలను ప్రదర్శిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా నాటకాలు వేస్తున్నారు. సినిమాలు, సీరియళ్లకు దీటుగా ఇల్లత్తూరు గ్రామానికి చెందిన వీధి నాటకాలకు ఉండే క్రేజ్ మాత్రం ఇప్పటికీ తగ్గడం లేదు. సుమారు 70 యేళ్లుగా కళాకారులను తీర్చిదిద్దడంలో ఇల్లత్తూరుకు మంచి పేరు ఉంది.

యువకుల్లో పెరిగిన ఆసక్తి..

గ్రామాల్లో టీవీలు, సినిమాలను ఒకవైపు చూస్తున్నా వీధి నాటకాలపై కూడా ప్రజలు ఆసక్తిని చూపుతున్నారు. ఈ నాటకాలను ప్రదర్శించేందుకు యువతతోపాటు పెద్దలు కూడా ఉత్సాహం చూపుతున్నారు. గ్రామాల్లో కొంతమంది వీధి నాటకాలను ప్రత్యేకంగా నేర్చుకుని గ్రామస్తులు, కుటుంబసభ్యుల మధ్య ప్రదర్శించి మురిసిపోతున్నారు. తండ్రి తరువాత కొడుకు కూడా వీధి నాటకాల్లో శిక్షణ తీసుకుని, కళలకు జీవం పోస్తున్నారు.

మహాభారతంపై మక్కువ ఎక్కువ

ఇల్లత్తూరు గ్రామానికి చెందిన కళాకారులు ఎక్కువగా మహాభారతం నాటకాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దుర్యోధన వధ, సత్యహరిశ్చంద్ర, శ్రీరాముని పట్టాభిషేకం తదితర నాటకాలను ప్రదర్శించేందుకు కళాకారులు ఆసక్తి చూపుతున్నారు. అంతే కాకుండా భక్త ప్రహ్లాద, భక్త సిరియాళ, శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం, చెన్నకేశవస్వామి మహాత్మ్యం తదితర భక్తి నాటకాలను ప్రదర్శిస్తున్నారు. గ్రామాల్లో కొంత మంది కళాకారులు బృందాలుగా ఏర్పడుతున్నారు. వీరంతా పౌరాణిక నాటకాల్లో అనుభవం ఉన్నవారి నుంచి ప్రత్యేకంగా శిక్షణ తీసుకొని నాటకా ప్రదర్శిస్తున్నారు.







వివిధ వేషాలతో ఇల్లత్తూరు కళాకారులు

వీధి నాటకాలే మా ప్రాణం



నేను 30 యేళ్లుగా వీధి నాటకాలు వేస్తున్నాను. మా తండ్రి తరువాత నేను నాటకాలు వేస్తున్నాను. వీధి నాటకాలు వేస్తుంటే చాలా మంది మమ్మల్ని అభినందించడం చాలా సంతోషంగా ఉంటుంది. ఒక్కోసారి పెద్ద పెద్ద రాజకీయ నాయకులు కూడా మా నాటకాలను చూస్తారు. ఏడాదిలో 300 రోజులు బిజీగా ఉంటున్నాం.

- రూబన్ మాస్టర్, వత్రపెరంబదూర్

కళాకారులను ప్రోత్సహించాలి



గ్రామాల్లో నేటికీ కళలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. కళాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తే వారు నాటకాల ద్వారా తమ కళను మరింత ప్రదర్శించే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం కళాకారులకు ప్రత్యేకంగా నిధులను కేటాయించాలి. అప్పుడే వీధి నాటకాల ప్రదర్శనకు వెసులుబాటు లభిస్తుంది.

- మురుగయ్య మాస్టర్, ఇల్లత్తూరు

స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ

కార్వేటినగరం: నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి స్కిల్ హబ్‌ను నియోజకవర్గంలో ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, కార్వేటినగరం ప్రిన్సిపల్ గణేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఇతర డిగ్రీలు కలిగిన స్థానిక నిరుద్యోగ యువతీయువకులకు డొమెస్టిక్ ఎంట్రీ ఆపరేటర్‌గా శిక్షణ అందించి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికెట్ ఇప్పిస్తామన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు కార్యాలయ సిబ్బంది టి.అబ్దుల్‌ను 81425 09017 నెంబరుకు సంప్రదించాలన్నారు.

రిజిస్ట్రేషన్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

నగరి: ఆస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో అధికారులు అవకతవకలకు పాల్పడినట్లు తన దృష్టికి వస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్‌లను హెచ్చరించారు. గురువారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్న ఆయన సబ్‌రిజిస్ట్రార్ సుబ్రమణ్యం, తహసీల్దార్ రవికుమార్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ రిజిస్ట్రేషన్ల వ్యవహారాలకు సంబంధించి ఫిర్యాదులు అందుతున్నాయని, అందుకే ప్రత్యక్షంగా కార్యాలయానికి విచ్చేశామన్నారు. అమలులోలేని నిబంధనలతో రిజిస్ట్రేషన్‌కు వచ్చేవారిని ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకూడదన్నారు. ఇకపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రమేష్, జ్యోతినాయుడు, గుణశేఖర్, శ్రీనివాసులు రెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై రైతులకు అవగాహన

నింద్ర: మండలంలోని అగరం గ్రామంలో రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సజ్జ పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు ఇచ్చారు. విత్తన శుద్ధి చేయడంతో రైతులకు మేలు జరిగే అంశాలను వివరించారు. రైతులు సజ్జపంటలో కలుపు నివారణ, సస్యరక్షణ చర్యలను తెలియజేశారు. అనంతరం రైతులకు విత్తన శుద్ధి మందులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ తులసీరాం, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



ఉపాధి హామీ పనులను తనిఖీ చేస్తున్న పీడీ రాజశేఖర్

కార్వేటినగరం: జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్.రాజశేఖర్ పెనుమూరు మండలంలో ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పులికల్లు గ్రామ పంచాయతీలో జరుగుతున్న కాలువ పూడికను తనిఖీ చేసి కూలీలతో చర్చించారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించడంపై ఆరా తీశారు. అనంతరం మదర్‌ప్లాంట్ కార్యక్రమంలో భాగంగా గోడుగుమానుపల్లి, రామాకృష్ణపురం, అట్లవారిపల్లి పంచాయతీలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ అమృతసరోవర్, మినీ అమృత సరోవర్, రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంపకం, ప్రభుత్వ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటించాలని అధికారులకు సూచించారు. రైతుల పొలాల్లో పండ్ల తోటలు, మల్లెపూల సాగు, వివిధ రకాల పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సుబ్రమణ్యం, ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ గుణశేఖర్, ఈసీ సతీష్, టీఏ వినోద్, పరదేశి, నరసింహులు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా అండర్‌-14 క్రికెట్ జట్టు ఎంపిక

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్‌-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ఈ నెల 24న స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు తెల్లని దుస్తులు ధరించి, ఆధార్, బర్త్ సర్టిఫికెట్లతోపాటు క్రికెట్ కిట్టుతో రావాలని తెలిపారు. సెలక్షన్స్ ఇన్‌చార్జిగా ఎం.నవీన్‌కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు. వివరాలకు 78424 74679 నెంబరులో సంప్రదించాలన్నారు.

పాలల్లో వెన్న శాతం ఉంటే మంచి ధరలు



వెన్న శాతం పెరిగే విధానాలను వివరిస్తున్న కో-ఆర్డినేటర్ మునిక్రిష్ణారెడ్డి

పాలసముద్రం: పాలల్లో వెన్నశాతం బట్టి ధర ఉంటుందని శ్రీజ డెయిరీ మిల్క్ ప్రొడ్యూస్ కో-ఆర్డినేటర్ మునిక్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం రాచపాల్యంలో ఎంఆర్‌జీ సూపర్‌వైజర్ మారి సమక్షంలో పాల మిత్రాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మునిక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ పాడిరైతుల నుంచి పాలను సేకరించి, వెన్న శాతాన్ని తప్పకుండా నమోదు చేయాలన్నారు. పాడి పశువులు పెంపకంలో జాగ్రత్తలను వివరించారు. పాలల్లో వెన్న శాతం పెరిగే విధానాలను తెలిపారు. పాడి రైతుల కోసం ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యమైన పశుగ్రాసం, ఖనిజ మిశ్రమం కాల్షియంను ఆధునిక శైలిలో అందిస్తున్నామని తెలిపారు. సంవత్సరానికి బోనస్ కూడా కంపెనీ అందిస్తుందని తెలిపారు. చూలు పశువులను ఎక్కువ దూరం నడిపించడం, పరుగెత్తించడం, ఎత్తు ప్రదేశాలకు వెళ్లనివ్వడం, భయపెట్టడం చేయరాదని సూచించారు. ఎంఆర్‌జీ పాడి రైతులు పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ



పంటకు జీవామృతాన్ని సరఫరా చేస్తున్న రైతులు

పాలసముద్రం: జీవామృతం వినియోగంతో పంటలను ఆశించే చీడపీడలను నివారించవచ్చని, రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం లేదని ప్రకృతి వ్యవసాయ విభాగం ఎల్‌సీఆర్‌పీ ప్రతాప్ తెలిపారు. సీఎం కండ్రిగలో గురువారం జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. 100 లీటర్ల ద్రవ జీవామృతం తయారీకి 5 లీటర్ల గోమూత్రం, 5 కిలోల దేశీయ ఆవుపేడ, ఒక కిలో బెల్లం, శనగపిండి, పిడికెడు పుట్టమన్ను, 100 లీటర్ల నీటిలో కలిపి 5 రోజులపాటు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం సవ్య దిశలో కలపాలని సూచించారు. అనంతరం దాన్ని వడగట్టి వచ్చిన ద్రావణాన్ని జీవామృతంగా వినియోగించుకోవచ్చన్నారు. దీన్ని మొక్కలకు వేసుకుంటే ఎలాంటి ఎరువులు, పురుగు మందులు వినియోగించాల్సిన అవసరం ఉండదన్నారు. సీఎం కండ్రిగలో నిర్మల రైతు సాగు చేసిన ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించి జీవామృతాన్ని సాగులో ఉన్న పంటలకు ఎలా వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో మునియమ్మ, రైతులు పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

నైపుణ్యాలు ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్: ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు నైపుణ్యాలు ముఖ్యమని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌నాయుడు అన్నారు. గురువారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. నియోజకవర్గానికి త్వరలో అనువైన కంపెనీలు తీసుకురానున్నట్లు చెప్పారు. ఆ కంపెనీల్లో ఉద్యోగాలు విరివిగా కల్పించేందుకు చర్యలు చేపడుతామన్నారు. అనంతరం రెండు ప్రముఖ్య కంపెనీలు ఉద్యోగ మేళాను నిర్వహించి విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి, అధ్యాపకులు మీరాసాహేబ్, శరవణ, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన



ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో కోర్ ఎన్జీవో ప్రతినిధులు

గంగాధరనెల్లూరు: కోర్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ముక్కలతూరు ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఈ కార్యక్రమం చేపట్టారు. 8, 9 ,10 తరగతి విద్యార్థులకు మీకు తెలుసా అనే ఐఈసీ క్యాంపు ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్ ఎన్జీవో ప్రాజెక్టు మేనేజర్ సద్దాం, ఓఆర్‌డబ్ల్యూ రేవతి, పి.దుర్గా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఇంటింటికీ కొళాయి’పై సర్వే పూర్తి

చిత్తూరు అర్బన్: ఇంటింటికీ నీటి కొళాయిపై సర్వేను సత్వరం పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ అధికారులను, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. ఇంటింటికీ నీటి కొళాయి సర్వే, పన్నుల వసూలు, వంద రోజుల్లో హౌసింగ్ ప్రోగ్రాం అంశాలపై సంబంధిత అధికారులు, వార్డు అడ్మిన్, అమినిటీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా నీటిని సరఫరా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ సర్వే చేయిస్తోందని అన్ని వార్డుల్లో సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు. వార్డుల వారీగా సమీక్షిస్తూ, ప్రతి ఇంటినీ సర్వే చేసి వివరాలను నమోదు చేయాలని చెప్పారు. అనుమతి ఉన్న కనెక్షన్లు, అనుమతి లేని కనెక్షన్లు, రికార్డుల్లో ఉన్న క్షేత్రస్థాయిలో కనెక్షన్ లేనివి వంటి వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. వార్డు స్థాయిలో మిగిలిన సర్వేను సత్వరం పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆస్తి, నీటి పన్నుల వసూళ్లపై వార్డుల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో డా.అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, హౌసింగ్ ఏఈ శ్రీధర్, సూపర్‌వైజర్ అధికారులు, వార్డు అడ్మిన్, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన

నగరంలోని మురుకంబట్టు సర్కిల్లో జరుగుతున్న సుందరీకరణ పనులను కమిషనర్ అరుణ గురువారం సాయంత్రం పరిశీలించారు. మురుకంబట్టు సర్కిల్ సుందరీకరణ చర్యల్లో భాగంగా ఐలాండ్‌లో మొక్కల పెంపకం, ఫౌంటెన్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలన్నారు. పనుల నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కమిషనర్ వెంట డీఈ వెంకట ప్రసాద్, ఏఈలు, వార్డు కార్యదర్శులు ఉన్నారు.

ప్రజా సేవకే విజయ్ కొత్త పార్టీ

శ్రీరంగరాజపురం: ప్రజా సేవకే తమిళ సినీ నటుడు విజయ్ కొత్త పార్టీ స్థాపించినట్లు రాష్ట్ర విజయ్ అభిమాన సంఘం అధ్యక్షుడు రూపేష్ అన్నారు. గురువారం మండలంలోని చొక్కమడుగు గ్రామంలో నూతన పార్టీ ఆవిష్కరణలో భాగంగా విజయ్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రూపేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం విజయ్ తమిళగై వెట్రి కళగం అనే పార్టీని స్థాపించినట్లు తెలిపారు. అభిమాన సంఘం నాయకులు కందస్వామి, బాలాజీ, మదన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం



హోమపూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు



హోమపూజల్లో పాల్గొన్న భక్తులు

నగరి: కీళపట్టులోని త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పరివార ఆలయాల అష్టబంధన కుంభాభిషేక వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నూతనంగా నిర్మించిన స్వర్ణాకర్షణ భైరవర్, వారాహి ప్రత్యంగిర, శరభేశ్వర ఆలయాల కుంభాభిషేక వేడుకలు వేడుకగా చేపట్టారు. శ్రీఓం పంచశక్తి పీఠ స్థాపకులు దేవియమ్మ, పీఠాధిపతి జ్ఞానశక్తియేంద్ర స్వామి సమక్షంలో రుత్విక్ వరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, వాస్తు హోమం, శిఖరానికి క్షీరాధివాసం, జలాధివాసం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం కార్యక్రమాలు నిర్వహించా రు. కుంభ కలశాలను ఆలయ ప్రదక్షిణ చేసి శిఖరం పైకి చేరుకున్నారు. వేద పండితులు కుంభకలశ అభిషేకం చేయగా ఆ నీటి కోసం జనం బారులుతీరారు. కుంభాభిషేకం అనంతరం దేవతల విగ్రహాలకు మహాభిషేకం చేసి, అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దేవతలను దర్శించుకున్న భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ నిర్వాహకుడు సుబ్రమణ్యం కుంభాభిషేక ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



కుంభాభిషేకం చేస్తున్న వేదపండితులు

గాలికుంటు టీకాలతో ఎన్నో ప్రయోజనాలు



పల్లెలో పాడి ఆవులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సహాయకుడు

ఐరాల: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించడం వలన ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని మద్దిపట్లపల్లె పశు వైద్యాధికారి పినాకపాణి అన్నారు. మండలంలోని మద్దిపట్లపల్లె పశు వైద్యశాల పరిధిలో బుధవారం జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో పశువులకు టీకాలు వేసి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నాలుగు నెలలకు పైబడిన 3,387 పశువులకు 20వ తేదీ నుంచి గురువారం వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు చెప్పారు. ఈ గాలికుంటు వ్యాధి వలన పశువుల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గి, పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని సూచించారు. ఎద్దులలో పనిచేసే సామర్థ్యం తగ్గుతుందని దీంతో రైతులు ఎంతో నష్టపోతారన్నారు. వర్షాకాల సీజన్‌లో పశువులకు జ్వరం, మేత తినకపోవడం, వణుకు రావడం, పాలు తగ్గిపోవడం, పళ్ల కొరకడం, పెదువుల వాపు, చొంగకారడం, నోటిలో పుళ్లు ఏర్పడిన వెంటనే పాడి రైతులు పశు వైద్యాధికారిని సంప్రదించి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సూచించారు. పాడి రైతులు తప్పనిసరిగా ఈ టీకాలను వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలోనే సుఖ ప్రసవం

తవణంపల్లె: గర్భిణులకు ఆస్పత్రిలోనే సుఖ ప్రసవం ఉంటుందని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పట్రపల్లెలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఉచిత వైద్యం అందించేందుకు గ్రామ గ్రామానికి వెళుతున్నట్లు తెలిపారు. మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పేదలకు వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డెంగీ, మలేరియా వంటి ప్రమాదకరమైన వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎస్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: అక్షర ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతులను శుభ్రం చేసుకుని భోజనం చేయాలని, వేడిగా ఉన్న ఆహారాన్ని తినాలని తెలిపారు. వర్షాకాలంలో కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహార పదార్థాలను తీసుకోవడంతో టైఫాయిడ్, డయేరియా వస్తాయని తెలిపారు. దోమల ద్వారా మలేరియా, వైరల్ ఫీవర్లు, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చుననతి తెలిపారు. కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు.